సాక్షి
తిరుపతి
బుధవారం । 21 । ఆగస్టు । 2024



వసతులు మెరుగుపడాలి
ఏర్పేడు వ్యాసాశ్రమంలోని కళాశాలలో వసతులు మెరుగుపడాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. - 8లో



హెల్త్ లాస్
వెయిట్ లాస్.. వెల్ నెస్ పేరుతో కొన్ని సెంటర్లు పుట్టుకొస్తున్నాయి. శాస్త్రీయ పద్ధతుల్లో బరువు తగ్గిస్తామని బురిడీ కొట్టిస్తున్నాయి. - 8లో



ఆత్మహత్యా యత్నం
నాగలాపురం సచివాలయం-2 ఏఎన్ఎం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి యత్నించింది. - 8లో

న్యూస్‌రీల్

వీసీ ఆకస్మిక తనిఖీ

తిరుపతి సిటీ: ఎస్వీయూ వీసీ డాక్టర్ సీహెచ్.అప్పారావు మంగళవారం ప్రకాశం భవన్‌లోని పలు శాఖల్లో తనిఖీలు నిర్వహించారు. హోమ్ సైన్స్, ఆంత్రోపాలజీ, ఎకనామెట్రిక్స్, మ్యాథ్‌మాటిక్స్ శాఖలకు సంబంధించి తరగతి గదులు, కార్యాలయాలను పరిశీలించారు. విద్యార్థుల గైర్హాజరుపై ఆరాతీశారు. తరగతులు, ల్యాబ్‌లు క్రమంతప్పకుండా నిర్వహించాలని అధ్యాపకులను ఆదేశించారు.

ఎస్వీయూలో 23న జాబ్‌మేళా

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో ఈ నెల 23వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయాధికారి టీ.శ్రీనివాసులు తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ, బీటెక్ పూర్తి చేసుకున్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సుమారు ఎనిమిది ఎమ్ఎన్‌సీ కంపెనీలకు చెందిని ప్రతినిధులు ఈ జాబ్‌మేళాకు హాజరవుతారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9533889902, 7989810194 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఆదర్శనీయులు మాలతీ చందూర్




సన్మానం అందుకున్న ముఖ్యఅతిథులు

తిరుపతి సిటీ: మహిళల పాత్రను, స్త్రీ శక్తిని సమాజానికి చాటిన ఆదర్శనీయులు మాలతీ చందూర్ అని కుప్పం ద్రవిడ వర్సిటీ మాజీ వీసీ, మహిళా వర్సిటీ తెలుగు విభాగాధ్యక్షులు ప్రొఫెసర్ కొలకలూరి మధుజ్యోతి కొనియాడారు. మంగళవారం మహిళా వర్సిటీ తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో సావేరి సెమినార్ హాల్‌లో డాక్టర్ మాలతీ చందూర్ స్మారక ధర్మ నిధి సదస్సును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. సమాజాన్ని, స్త్రీలను చైతన్యవంతులను చేసే ప్రయత్నం చేసిన మహానీయులలో ఒకరైన మాలతీ చందూర్ జీవితం ఆదర్శనీయమన్నారు. మాలతీ చందూర్ ట్రస్ట్ ప్రతినిధులు రూ.8 లక్షలు ధర్మనిధిని తెలుగు శాఖకు అందించారని గుర్తుచేశారు. అనంతరం డీన్ ప్రొఫెసర్ వాణి మాట్లాడారు. మాలతీ చందూర్ నవలలు–మహిళా చైతన్యంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథులను నిర్వాహకులు ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన మిసిమి మాసపత్రిక సంపాదకులు వల్లభనేని అశ్వినికుమార్, వైఎస్.శారద, డాక్టర్ యజ్ఞశేఖర్, వై.శుభాషిణి, లక్ష్మీప్రియ, యువశ్రీ తదితరులు పాల్గొన్నారు.

24న అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతిలోని ఎస్వీయూ స్టేడియంలో ఈ నెల 24వ తేదీన ఉదయం 6.30 గంటలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–14, 16, 18, 20, 23 బాలబాలికల అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఆ మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.రాబర్ట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల జరగబోయే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌నకు ఉమ్మడి చిత్తూరు జిల్లా తరపున ప్రాతినిథ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు వయసు, జనన ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు తీసుకురావాలని, మరిన్ని వివరాలకు 86868 67078, 96420 09767నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

హోంగార్డులకు ఆర్థిక సాయం



చెక్కును అందజేస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైమ్: జిల్లాలో పనిచేస్తున్న ఏడుగురు హోంగార్డులకు వైద్య ఖర్చుల కోసం ఎస్పీ సుబ్బరాయుడు మంగళవారం ఆర్థిక సాయం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఏడుగురు హోంగార్డులు ఇటీవల అనారోగ్య కారణాలతో వైద్య ఖర్చుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఒక్కొక్కరికీ రూ.4,900 చొప్పున హోంగార్డ్ వెల్ఫేర్ ఫండ్ నుంచి మొత్తం రూ.34,993ల చెక్కును సిబ్బందికి అందజేశారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 22 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 71, 595 మంది స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.89 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

రెక్కాడితేగానీ డొక్కాడని కార్మికులపై కూటమి ప్రభుత్వం పగబట్టింది. రెండు నెలలుగా మైకా, అభ్రకం, క్వారీ పరిశ్రమలకు అనుమతులివ్వకుండా జాప్యం చేస్తోంది. ఎక్కడికక్కడ గనుల కార్యకలాపాలు నిలిపివేయడంతో వాటిపై ఆధారపడిన కార్మికులు వీధిన పడాల్సి వచ్చింది. పిల్లల చదువుకు ఫీజులు కట్టలేక.. కుటుంబాలను నెట్టుకురాలేక అల్లాడాల్సిన దుస్థితి ఏర్పడింది. న్యాయం చేయాలని ఆందోళనలు చేస్తున్నా అధికారుల మనసూ కరగకపోవడం కార్మికులకు శాపంగా మారింది.



ఆగిన ప్లాంట్ పనులు

బతుకుపై.. కూటమి బండ!

సైదాపురం/చిల్లకూరు: కార్మికుల బతుకుకు కూటమి ప్రభుత్వం గుది'బండ'గా మారింది. తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో ఉన్న ఖనిజ తవ్వకాలను ఎక్కడికక్కడ నిలిపేసింది. జూన్ 12వ తేదీ నుంచి మైకా పరిశ్రమను పూర్తిగా మూసేసింది. దీనిపై ఆధారపడిన 30 వేల మంది కార్మికులకు ఉపాధి లేకుండా పోయింది. తిరుపతి జిల్లాలోని సైదాపురం, చిల్లకూరు మండలాల్లో మొత్తం 143 గనులు ఉండేవి. ప్రస్తుతం ఆ సంఖ్య 40కి చేరింది. వీటి ద్వారా ప్రత్యక్షంగా 15 వేల మంది, పరోక్షంగా మరో 15 వేల మంది ఉపాధి పొందుతున్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో నూతన పాలసీ అంటూ మెలిక పెట్టింది. తాము చెప్పేవరకు మైకా పరిశ్రమ కార్యకలాపాలు నిర్వహించరాదని హుకుం జారీ చేసింది. గడిచిన రెండు నెలలు నుంచి ఒక పర్మిట్ కూడా ఇవ్వకుండా కాలయాపన చేస్తోంది. దీంతో మైకా గనులతో పాటు క్వారీలు కూడా మూతపడ్డాయి. వాటిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న గని కార్మికులు వీధిన పడ్డారు. ఈ సంక్షోభం ఒక్క కార్మికులకే కాదు యాజమాన్యాలపైనా ప్రభావం చూపుతోంది. ప్రస్తుతం క్రయవిక్రయాలు పూర్తిగా నిలిచిపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. 45 ఏళ్లగా ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి తలెత్తలేదని పలువురు ఆవేదన చెందుతున్నారు.

రాకపోకలు బంద్

సైదాపురం మండలంలో లభించే ఖనిజాన్ని దేశవిదేశాలకు నిత్యం తరలించేవారు. గడిచిన 60 రోజుల నుంచి గనులన్నీ మూతపడడంతో రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించింది. వాహన యాజమానులతో పాట లోడింగ్ చేసే కూలీలకు కూడా ఉపాధి లేకుండా పోయింది. ప్రభుత్వ అనుమతులతో మైనింగ్ కార్యకలాపాలు సాగిస్తున్న యాజమానుల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. కోట్ల రూపాయల వ్యయంతో నిర్వహించే మైనింగ్ ఆపరేషన్ పూర్తిగా నిలిచిపోవడంతో ఏమిచేయాలో తెలియక కొట్టుమిట్టాడుతున్నారు.



మైకా ఇదే

ఓట్లేసినందుకు.. బుద్ధొచ్చింది!

సైదాపురం, పొదలకూరు, గూడూరు మండలాల్లో మైగాగని కార్మికులున్నారు. గడిచిన రెండు నెలలుగా గని కార్మికులు ఆకలికేకలతో అలమటిస్తున్నారు. తమ బిడ్డలకు పాఠశాల ఫీజులు కూడా చెల్లించలేని నిస్సహాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. గత ఎన్నికల్లో అత్యధిక మంది కార్మికులు కూటమి ప్రభుత్వానికే ఓటేశారు. దీంతో కూటమి ప్రభుత్వానికి సైదాపురం మండలంలో భారీ మెజారిటీ వచ్చింది. గనులు, క్వారీలు, ఫ్యాక్టరీలను ఆపేసి తమ ఉపాధిపై దెబ్బకొట్టడం ఏంటని పలువురు కార్మికులు ప్రశ్నిస్తున్నారు.

సిలికా..విస్తారంగా



అరుదుగా దొరికే సిలికా నిక్షేపాలు చిల్లకూరు, కోట మండలాల్లో విస్తారంగా దొరకుతాయి. రోజుకు 50 నుంచి 70 లారీల వరకు సిలికా లోడ్లు ఇతర ప్రాంతాలకు వెళ్తుంటాయి. ఇలా నెలలో 1.5 లక్షల టన్నులు రవాణా జరుగుతోంది. దీని వల్ల ఈ రెండు మండలాల్లోని సుమారు 14 గ్రామాల వారికి ఉపాధి దొరుకుతుంది. ఒక లారీ సిలికాను లోడ్ చేసేందుకు కనీసం పది మంది కూలీలు అవసరం. అలా ఒక కూలీ మూడు లారీల్లో పనిచేస్తే రోజుకు రూ.800 వరకు గిట్టుబాటు అవుతంది. అయితే గత రెండు నెలలుగా సిలికా గనులు మూతపడడంతో సుమారు రెండు వేల మంది కార్మికులు వీధిన పడ్డారు. ఉపాధి చూపాలని కోరుతూ ఇటీవల గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద రెండు వందల మంది కార్మికులు నిరసన వ్యక్తం చేసినా ఫలితం లేకుండా పోయింది. వారి సమస్యలను ఏ ఒక్కరూ పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

సిలికా ఇలా

చిల్లకూరు, కోట మండలాల్లో గనుల సంఖ్య	76
డీలర్ల సంఖ్య	250

జిల్లా సమాచారం

మైకా గనులు	ప్రస్తుతం పనిచేస్తున్నవి
143	40

దొరికే ఖనిజాలు: **మైకా, క్వార్ట్జ్, ఫల్స్‌పర్**

ప్రత్యక్షంగా..పరోక్షంగా ఉపాధి పొందుతున్న వారి సంఖ్య: **30వేలు**

బతుకులు నాశనం



మా బతుకులపై కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే బండరాయి వేసింది. మా ఊరి దగ్గర్లోనే ఉన్న మైకా గనికి 45 ఏళ్లగా కూలిపనులకు వెళ్తున్నాం. వర్షాలొస్తే తప్ప గనులను మూసివేసింది లేదు. ఈ ప్రభుత్వం వచ్చాకే రెండు నెలలుగా మూత వేశారు. 60 రోజులుగా పనులు లేక అల్లాడిపోతున్నాం. తిండికి కూడా తిప్పలు పడుతున్నాం.
- రాజమ్మ, తుమ్మల తలుపూరు, సైదాపురం మండలం

కూలి పనులు దొరకడం లేదు



మేము గనుల్లో పనిచేసుకుని సాయంత్రం ఇంటికొచ్చే వాళ్లం. వారానికి ఒకసారి బట్వాడా రూపంలో యాజమాని డబ్బులిచ్చే వారు. 60 రోజులుగా గనులు మూసివేయడంతో ఉన్న ఉపాధి పోయింది. ఎక్కడా పనులు కూడా దొరకడం లేదు. భార్యాబిడ్డలను కూడా పోషించుకోలేక పోతున్నాం. ఈ ప్రభుత్వం వచ్చాకే ఇలా జరుగుతోంది.
-టీ.సుబ్రమణ్యం, తుమ్మల తలుపూరు, సైదాపురం మండలం

వీధిన పడ్డాం



మా గ్రామాల సమీపంలోనే ఉన్న క్వారీల్లో పనులకు వెళ్లి బతికేవాళ్లం. నేడు క్వారీలన్నీ మూతపడ్డాయి. పనులు లేక వీధిన పడ్డాం. చరిత్రలోనే ఇన్ని రోజులు క్వారీలు గానీ, గనులు కానీ మూతవేసింది లేదు. అడిగితే కొత్తకొత్త కారణాలు చెబుతున్నారు. వెంటనే గనులకు అనుమతులివ్వాలి. కూలీలకు పని కల్పించాలి.
- చెంచయ్య, తుమ్మల తలుపూరు, సైదాపురం మండలం

పనుల్లేక పస్తులు



సిలికా మైనింగ్‌లోకి కూలికి వెళితే రోజుకు రూ.500 నుంచి రూ.800 వరకు వచ్చేది. దీంతో కుటుంబం మొత్తం జీవనం సాగించేది. ఇప్పుడు గత రెండు నెలలుగా సిలికా మైన్‌లలో పనులు నిలిపేశారు. పనుల్లేక ఇంటిల్లిపాదీ ఇతర పనులకు వెళ్లాల్సి వస్తోంది. అయినప్పటికీ జీవనం కష్టంగా మారింది.
- పావని, మోమిడి, చిల్లకూరు మండలం

కష్టంగా ఉంది



గ్రామానికి సమీపంలోనే సిలికా మైన్‌లు ఉన్నాయి. మైన్ లీజులు దారులు అవసరమైనప్పుడు పనులకు పిలుస్తుంటారు. ఇంటి వద్దనే ఉండి పని ఉన్న సమయంలో లోడ్ చేసేందుకు వెళ్లేవాళ్లం. దీని వల్ల రోజూ కూలి గిట్టుబాటు కావడంతో పాటుగా కొన్ని అవసరాలు తీరేవి. అయితే రెండు నెలలుగా మైన్‌లలో పనులు నిలిపి వేశారు. ఎక్కడా పనుల్లేక బతుకు బండిని కష్టంగా నడుపుతున్నాం.
- పద్మమ్మ, మోమిడి, చిల్లకూరు మండలం

సైదాపురం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న గని కార్మికులు (ఫైల్)



న్యాయం చేయండి


గడిచిన 60 రోజులుగా గనులు, క్వారీ పనులు మూసివేయడంతో రోజువారీ కార్మికులు ఆందోళనలో మునిగిపోయారు. పనులు లేక భిక్షాటన చేసుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన చెందుతున్నారు. ఈ మేరకు తమకు న్యాయం చేయాలంటూ సైదాపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. అయినా ప్రయోజనం లేకపోయింది.

డబ్బు కోసమే ఈ నాటకాలు



గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన

మైకా పరిశ్రమపై పెత్తనం కోసం కూటమి ప్రభుత్వం ఎత్తుగడలు వేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో అవినీతి జరిగిదంటూ లేని పోని అపోహలు సృష్టించింది. ఈ మేరకు కొత్త పాలసీ తీసుకొస్తామంటూ కాలయాపన చేస్తోంది. ఇదంతా డబ్బుకోసమే వేస్తున్న ఎత్తుగడ అని కార్మికులు ఆరోపిస్తున్నారు.



వెలవెలబోతున్న మైకా గని లోపల ప్రాంతం



క్వార్ట్జ్ ఖనిజం ఇదే



నిర్మానుష్యంగా ఉన్న మైకా ప్లాంట్

• ఆగని ఆందోళన



స్విమ్స్ లో రోడ్డుపైనే ఓపీ సేవలు నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్లు

కోల్‌కతా ఘటన నేపథ్యంలో నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో మంగళవారం తిరుపతి రుయా, స్విమ్స్ ఆస్పత్రుల్లో జూనియర్ డాక్టర్లు వినూత్న నిరసనకు దిగారు. దీక్షా శిబిరాల వద్ద రోగులకు ఓపీ సేవలను చేపట్టారు. ప్రాథమిక వైద్య పరీక్షలను నిర్వహించి నిరసనకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్లు మాట్లాడుతూ విధుల్లో ఉన్న వైద్యురాలి పట్ల అత్యంత అమానుషంగా వ్యవహరించి హత్య చేసిన ఘటనపై అక్కడి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంభించడం బాధాకరమన్నారు. నిజాలను వెంటనే వెలుగులోకి తేవాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జూనియర్ డాక్టర్లు చేపట్టిన నిరసనకు వివిధ సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఎస్ఎఫ్ఐ, ఐద్వా, పారా మెడికల్ అసోసియేషన్లు, తిరుపతి ముస్లిం మత పెద్దలు, ముస్లింలు పెద్ద సంఖ్యలో ర్యాలీగా చేరుకొని జూనియర్ డాక్టర్లకు మద్దతుగా నిలిచారు.
–తిరుపతి తుడా



కళ్లకు గంతలు కట్టి నిరసన

రుయాలో పారా మెడికల్ విద్యార్థుల ర్యాలీ



రేయ్ ఇటురారా?

- ఉపాధి సిబ్బందిపై పీడీ చిందులు
- అసంతృప్తి వ్యక్తం చేసిన ఉద్యోగులు
- సహోద్యోగులమనే గౌరవం లేదంటూ అసహనం



మాట్లాడుతున్న పీడీ శ్రీనివాసప్రసాద్

గూడూరు రూరల్: 'ఒరేయ్.. ఇటు రారా. ఏందిరా ఇది.. ఇంత అవినీతి ఎప్పుడైనా జరిగిందా.. ఎందుకిలా చేస్తున్నార్రా.. ఒరేయ్ మీకు అర్థం కావడం లేదురా..' ఇదీ మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జరిగిన సామాజిక బహిరంగ సభావేదికలో ఉపాధి సిబ్బందినుద్దేసించి పీడీ శ్రీనివాసప్రసాద్ అన్న మాటలు. తమ తోటి సిబ్బందితో మర్యాదగా మసులుకోవాల్సిన ఆయన ఏకవచనంతో పిలుస్తూ అవమానాలకు గురిచేస్తుండడంపై పలువురు ఉద్యోగులు అసహనం వ్యక్తం చేశారు. ఉద్యోగులమనే గౌరవం కూడా లేకుండా రారా..పోరా.. అని సంబోధించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఎంతకాదన్నా తాముకూడా సహోద్యోగులమేకదా అని చెబుతున్నారు. ఎలాగంటే అలా మాట్లాడడం సరికాదని హితవు పలుకుతున్నారు. కాగా వివిధ గ్రామాలకు సంబంధించిన నలుగురు క్షేత్ర సహాయకులతో పాటు ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్లను తొలగిస్తున్నట్టు పీడీ పేర్కొన్నారు. వీరి నుంచి రూ.6.77 లక్షల రికవరీకి ఆదేశాలు జారీ చేసినట్టు ఆయన వెల్లడించారు. ఇందులో మంగళపూరు, రామలింగాపురం, వెడిచెర్ల, కొండాగుంట గ్రామాల క్షేత్రసహాయకులు ఉన్నారని చెప్పారు. అలాగే విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించని ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్లను సస్పెండ్ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఏపీడీ వరప్రసాద్, ఏపీఓ పెంచలయ్య, పలువురు టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

104లో వసూళ్లపై ఫిర్యాదు

సాక్షి టాస్క్‌ఫోర్స్: 104లో పనిచేసే ఉద్యోగుల వద్ద ఆరు నెలలకు క్రితం ఓ డ్రైవర్, యూనియన్ పేరుతో డబ్బులు వసూలు చేసినట్లు బాధిత ఉద్యోగులు ఫిర్యాదు చేశారు. తిరుపతి జిల్లాలో ప్రతి సిబ్బంది దగ్గర ప్రభుత్వంలో విలీనమయ్యేలా చేస్తానని డబ్బులు గుంజుకున్నట్లు ఫిర్యాదులో ఆరోపించారు. సుమారు రూ.3లక్షల వరకు వసూలు చేసినట్లు బాధితులు ఆధారాలతో సహా చూపుతున్నారు. ఇదేవిధంగా చిత్తూరు జిల్లాలో కూడా వసూలు చేశారని తెలిసింది. దీనిపై బాధితులంతా ట్రస్టు ఉన్నతాధికారులను కలిసేందుకు సిద్ధంగా ఉన్నామని వారు పేర్కొన్నారు.

సర్దుబాటును తక్షణమే నిలిపివేయాలి

తిరుపతి ఎడ్యుకేషన్ : అసంబద్ధ జీఓలతో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల సర్దుబాటును తక్షణమే ప్రభుత్వం నిలిపివేయాలని, లేనిపక్షంలో బహిష్కరణకు పిలుపునివ్వాల్సి ఉంటుందని ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గట్ల సాంబిరెడ్డి, జిల్లా సహాధ్యక్షులు డాక్టర్ మొద్రిమేకల దేవరాజులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల స్థాయిలో ఎస్జీటీల అవసరం ఉన్నప్పటికీ, క్వాలిఫైడ్ సెకండరీ గ్రేడ్ టీచర్లను బలవంతంగా ఉన్నత పాఠశాలలకు కేటాయించడం దారుణమన్నారు. ఎస్జీటీలను ఉన్నత పాఠశాలలకు సర్దుబాటు చేసే విషయంలో వారి ఐచ్ఛికాన్ని పరిగణలో తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఐదేళ్లుగా పదోన్నతి రాకుండా, శాశ్వతమైన స్థానం లేకుండా తీవ్ర నిర్వేదంలో ఉన్న డీఈఓ పూల్ పండితులను ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. వారిని యథాస్థానంలో కొనసాగించాలని డిమాండ్ చేశారు.

సచివాలయ ఏఎన్ఎం ఆత్మహత్యాయత్నం

నాగలాపురం: నాగలాపురం సచివాలయం-2లో పనిచేస్తున్న ఏఎన్ఎం భార్గవి మంగళవారం నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి యత్నించింది. బాధితురాలి భర్త మణి కథనం.. నాగలాపురం రెండో సచివాలయంలో ఏఎన్ఎంగా భార్గవి పనిచేస్తున్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా పనిచేస్తున్న ఆశా వర్కర్లను ఆమె ప్రశ్నించడంతో వారు తన భార్య మీద అవాస్తవ ఆరోపణలు చేశారు. ఈ విషయంలో సీపీఎం మండల నాయకులు ఆశావర్కర్లతో కుమ్మక్కై బెదిరింపులు, నిరసనలు చేయడంతో ఒత్తిడిని తాళలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి యత్నించింది. నాగలాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించి, పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఆయన వెల్లడించారు. ఎస్ఐ ఓబయ్య కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

- చిత్తూరుకు చెందిన షర్మిల వెన్ను నొప్పితో బాధపడేది. బరువు పెరగడం వల్లే ఈ సమస్య తలెత్తిందని చెప్పడంతో మేలో వెయిట్‌లాస్ సెంటర్‌ను ఆశ్రయించింది. నెల రోజుల్లో ఈ రెండు సమస్యలను పరిష్కరిస్తామని సెంటర్ నిర్వాహకులు హామీ ఇచ్చారు. ఇందుకోసం తొలుత రూ.7,500, రెండో విడతగా రూ.7,500 వసూలు చేశారు. మళ్లీ మోకాళ్ల నొప్పిని కూడా తగ్గిస్తామని మరో రూ.3 వేలు గుంజుకున్నారు. తీరా బరువు తగ్గడం పక్కన పెడితే నొప్పులు మరింత పెరిగాయి. దీంతో షర్మిల సెంటర్‌లో గొడవకు దిగింది. ఎక్కడ ఫిర్యాదు చేసినా తమను ఏమీ చేయలేరని నిర్వాహకులు బెదిరింపులకు దిగడంతో ఆమె దిక్కు తోచక మిన్నకుండిపోయింది.
- తిరుపతికి చెందిన కృష్ణవేణి బరువు తగ్గాలని స్థానికంగా ఉన్న వెయిట్‌లాస్ సెంటర్‌కు వెళ్లింది. కేంద్రం నిర్వాహకులు ఆమెను మాటలతోనే బుట్టలో పడేశారు. దీంతో వారు చెప్పిన మేరకు తొలుత రూ.7 వేలు, ఆ తర్వాత మూడు నెలల కాలానికి రూ.35 వేలను ఫీజు చెల్లించారు. తీరా బరువు తగ్గినట్టే తగ్గి మరింత లావైపోయింది. చివరకు మోసం చేశారని తెలుసుకుని సెంటర్ నిర్వాహకులను నిలదీసింది. చెల్లించిన డబ్బులు తిరిగి ఇచ్చేయాలని పట్టుబట్టినా ప్రయోజనం లేకుండా పోయింది.

ఇవి మచ్చుకు రెండు మాత్రమే చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఇలాంటి కేసులు వందల సంఖ్యలో ఉన్నాయి. ఈ క్రమంలోనే ఇబ్బడిముబ్బడిగా వెలసిన వెయిట్ లాస్ సెంటర్లు బరువు తగ్గిస్తామంటూ ప్రజలను బురిడీ కొట్టిస్తూనే ఉన్నాయి.



రెండు జిల్లాల వ్యాప్తంగా...

ఇటీవల చిత్తూరు, తిరుపతిలో వెయిట్‌లాస్, బాడీ పెయిన్స్, దీర్ఘకాలిక నివారణ, హెయిర్ గ్రోత్ సెంటర్లు అధిక సంఖ్యలో కనిపిస్తున్నాయి. ఆయుష్ (ఆయుర్వేదం, యోగ, సిద్ధ, యునానీ, హోమియోపతి), అల్లోపతి పద్ధతిలో ట్రీట్‌మెంట్ చేస్తామని, కొన్ని రోజుల్లోనే అద్భుతమైన ఫలితాలు తథ్యమంటూ ఈ సెంటర్లు ఊదరగొడుతున్నాయి. ప్యాకేజీలతో ఎర వేసి ప్రజలను ఇట్టే ఆకర్షిస్తున్నాయి. ఇలాంటి సెంటర్లు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 215 దాకా ఉన్నట్లు అధికార గణాంకాలు చెబుతున్నాయి. చిత్తూరు జిల్లాలో చిత్తూరు, పలమనేరు, కుప్పం, పుంగనూరు, నగరి, వి.కోట, తిరుపతి జిల్లాలో పుత్తూరు, తిరుపతిలోని వీవీ మహల్ రోడ్డు, కపిలతీర్థం రోడ్డు, ఎయిర్ బైపాస్ రోడ్డు, ముత్యాలరెడ్డిపల్లె, కరకంబాడి రోడ్డు, భవానీ నగర్, సూళ్లూరుపేట, రేణిగుంట, శ్రీకాళహస్తి తదితర ప్రాంతాల్లోని సెంటర్ల ద్వారా సుమారు 50 వేల మంది కిపైగా చికిత్స తీసుకుంటున్నారు. ఇందులో మహిళలలే 35వేలకు పైగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.



హెల్త్ లాస్



సమాజంలో ఊబకాయం సమస్య ఎక్కువమందిని వేధిస్తోంది. మారిన జీవనశైలి కారణంగా శరీర బరువు విపరీతంగా పెరిగిపోతోంది. ఇదే అదునుగా వెయిట్ లాస్.. వెల్‌నెస్ పేరుతో కొన్ని సెంటర్లు పుట్టుకొచ్చాయి. శాస్త్రీయ పద్ధతుల్లో బరువు తగ్గిస్తామంటూ ప్రకటనలు గుప్పిస్తున్నాయి. అల్లోపతి.. ఆయుర్వేదమంటూ మాయమాటలు చెప్పి ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా సైజ్ జీరో ఆశపెట్టి మహిళలనే అధికంగా బుట్టలో వేసుకుంటున్నాయి. బాధితుల బలహీనతను ఆసరాగా తీసుకుని భారీగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. తీరా చికిత్స వికటించి దీర్ఘకాలిక ఇబ్బందులు తలెత్తితే మాకేం సంబంధంలేదంటూ చేతులు దులిపేసుకుంటున్నాయి. దీంతో బరువు తగ్గడం సంగతి దేవుడెరుగు.. పేషెంట్లను లేనిపోని కొత్త సమస్యల్లో పడేస్తున్నాయి.

కాణిపాకం: ఊబకాయం కారణంగా వివిధ రకాల నొప్పులు పుట్టుకొస్తున్నాయి. తలనొప్పి, కండరాల, మోకాళ్ల నొప్పులు, ప్రసవం, మానసిక ఒత్తిడి, విటమిన్స్ లోపం తదితర సాధారణ సమస్యలను కూడా చాలా మంది పెద్ద జబ్బులుగా భావిస్తున్నారు. మారిన ఆహారపు అలవాట్లు, ఊబకాయంతోనే జనం దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారని వైద్య నిపుణులు చెబుతున్నారు. అయితే వీటిని అధిగమించేందుకు ఈమధ్య కాలంలో చాలా మంది ఖర్చుకు వెనుకాడడం లేదు. తక్కువ కాలంలోనే బరువు, నొప్పులు, ఇతరత్రా సమస్యలు తగ్గిపోవాలనే వారి ఆరాటాన్ని వెయిట్‌లాస్ సెంటర్లు సొమ్ము చేసుకుంటున్నాయి. పుట్టగొడుగుల్లా ఇవి వెలుస్తున్నాయి.

జోరుగా ప్రకటనలు

పంచకర్మ చికిత్సల్లో భాగంగా స్నేహకర్మ, నదిస్వేదం, పిండిస్వేదం, కటివస్తి, జనువస్తి, నాశ్యకర్మ, శిరోధార, డిటాక్స్ థెరపీ, బరువు నియంత్రణ, మానసిక ఒత్తిడి, బాడీ మసాజ్, మైగ్రేన్..సమస్యలకు ట్రీట్‌మెంట్‌తో పాటు ప్రకృతి వైద్యం పేరిట జనరల్ మసాజ్, స్టీమ్‌బాత్, డైట్ కౌన్సెలింగ్, కోల్డ్ బ్లాంకెట్ ప్యాక్, తల కండరాలు, నడుం, భుజాలు, మోకాళ్ల నొప్పులకు చికిత్స చేస్తుంటారు. ఆక్యుపంక్చర్, యోగా.. వంటి సేవల పేరుతో కూడా జోరుగా ప్రకటనలు గుప్పిస్తున్నారు. ఇదే మాదిరి అల్లోపతిలో కూడా చేస్తామని సెంటర్లు ప్రచారం చేస్తున్నారు. అయితే వాటితో కొంతమందికి తాత్కాలికంగా లావు, నొప్పులు తగ్గినా మళ్లీ యథావిధిగా బరువు పెరగడం, నొప్పులు రావడం పరిపాటి మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఫీజుల వివరాలు

రోజులను బట్టి.. ప్యాకేజీలుంటాయి. 14 రోజులకు చికిత్స తీసుకుంటే రూ.599 నుంచి రూ.9,999 వరకు ఫీజు వసూలు చేస్తున్నారు. ఇందులో భాగంగా పలురకాల శారీరక నొప్పులు, ప్రసవం, ఊపిరితిత్తుల సమస్యలు, బరువు, జుత్తు ఊడటం.. వంటి సమస్యలకు పౌడర్, ఆయిల్ ఇస్తున్నారు. అలాగే 40 రోజులపాటు నేరుగా చికిత్స తీసుకుంటే రూ.7 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారు. అయితే తాము ట్రీట్‌మెంట్‌కు ఎంచుకున్న కోర్సు కాలం పూర్తయినా సమస్యలు తీరడం లేదని, ప్యాకేజీల పేరుతో మోసం చేస్తున్నారని బాధితులు చెబుతున్నారు. వాస్తవానికి చాలావరకు ఈ సెంటర్లను రిజిస్ట్రేషన్లు లేకుండా నిర్వహిస్తుండటం గమనార్హం. వీటిపై పర్యవేక్షణ అంటూ నిర్దిష్టంగా లేకపోవడమే ఈ సెంటర్ల పంట పండిస్తోంది. ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్స్, స్కానింగ్ సెంటర్లు, ల్యాబ్‌లను తనిఖీ చేసే అధికారులు వీటి మీద మాత్రం దృష్టి సారించడం లేదు. అసలు అక్కడ చేస్తున్నది సరైన ట్రీట్‌మెంటేనా? వైద్య ప్రమాణాలకు లోబడి చేస్తున్నారా? లేదా? సొంత విధానాలతో చేస్తున్నారా? అని ఇప్పటివరకు పరిశీలించిన దాఖలాలు లేవు.

ఆన్‌లైన్, వాట్సాప్ గ్రూపుల్లోనూ వ్యాపారం

నేరుగా ఇచ్చే చికిత్సే ఈ విధంగా ఉంటే.. ఆన్‌లైన్‌లో ఇచ్చే చికిత్సకు అడ్రస్ అనే మాటే లేదు..కానీ డబ్బులు మాత్రం దండుకునేస్తారు. ఇట్టే బుట్టలో పడేసేలా ఆకర్షణీయమైన ప్రకటనలు చూసి జనం వాటిని నమ్మి చేతులు కాల్చుకుంటున్నారు. డబ్బులు చెల్లిస్తే..ఇంటికే కొన్ని రకాల పౌడర్లు పంపిస్తూ.. జనాన్ని మోసగిస్తున్నట్లు ఆన్‌లైన్ బాధితులు వాపోతున్నారు. ఇక దీనికితోడు వాట్సాప్ గ్రూపుల్లోనే కొన్ని సెంటర్లు నడుస్తున్నాయి. రూ.600 నుంచి రూ.2వేల వరకు కడితే ప్రతిరోజూ గంట పాటు సలహాలు-సూచనలు ఇస్తుంటారు. వీటిలో అధికంగా మహిళలే మోసపోతున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రధానంగా వివాహమై సంతానలేమితో బాధపడుతున్న వారు కూడా ఇలాంటి వాటిని ఆశ్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

ప్యాకేజీలతో దోపిడీ

చాలా చోట్ల వెల్‌నెస్ సెంటర్లు ప్రజలను ఆకట్టుకునేలా ప్రకటనలు ఇస్తూ, దేశీయ వైద్యమంటూ అందినకాడికి దోచేస్తున్నాయి. తీసుకున్న ప్యాకేజీని పక్కన పడేస్తున్నాయి. సెంటర్లో అవి చేస్తాం..ఇవి చేస్తామని..చివరకు జీరో సైజు కాదు.. జేబులను జీరో చేస్తున్నాయి. దీంతో బరువు తగ్గకపోగా నొప్పులతో అవస్థలు పడుతున్నారు. ఇందులో ఉద్యోగులే అధిక సంఖ్యలో ఉండడం విశేషం. వీరంతా చెప్పుకుంటే అవమానంగా భావించి చాలావరకు మిన్నకుండిపోతున్నారు.

మోసపోయాం



లావు తగ్గాలని ఓ సెంటర్‌కు వెళ్లా. వాళ్లకు పెద్ద సిటీల్లో బ్రాంచెస్ ఉన్నాయంటే చేరా. మొదట్లో రూ.7,500 కట్టాను. మళ్లీ డబ్బులు కట్టామంటే రూ.7,500 చెల్లించా. లావు తగ్గలేదు... నొప్పులూ వదల్లేదు. నొప్పులు తగ్గలేదని ప్రశ్నిస్తే ఏవేవో సాకులు చెబుతున్నారు. రోజూ రావాలని మాత్రం చెబుతున్నారు. వారు మాత్రం వారంలో ఒక్కరోజు తెరుస్తారు. మళ్లీ తాళం వేస్తారు. అక్కడ పనిచేసే అమ్మాయికి జ్వరం, ఇంటి సమస్యలంటూ వెళ్లిపోతోంది. నేను వెళ్లి నా డబ్బులు తిరిగి ఇచ్చేయండి అని అడిగాను. ఇలా చాలా మంది వచ్చి ఆ సెంటర్లో గొడవలకు వస్తున్నారు. నమ్మి మోసపోయాం.

– మంజులాదేవి, చిత్తూరు

ఫిర్యాదులు వస్తున్నాయి



దేశీయ వైద్యం మంచిదే. కానీ ఆ వైద్యాన్ని పక్కాగా అందించే వారి వద్దకు వెళితే ఉత్తమం. ప్రస్తుత కాలంలో చాలా చోట్ల దేశీయ వైద్యం అంటూ మోసాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. అలాంటి వాటిజోలికి వెళ్లొద్దు. లావు తగ్గడంతోపాటు మరిన్ని రోగాలను కొనితెచ్చుకోవాల్సి వస్తుంది. ప్రధానంగా కిడ్నీలపై ఎఫెక్ట్ పడుతుంది. బీపీ, మధుమేహం వంటి వ్యాధులు కూడా వస్తాయి. మరింత లావైపోతారు. లేనిపోని నొప్పులు వస్తాయి. ఆయుష్‌లో ప్రభుత్వ వైద్యులు ఉన్నారు. వారి సలహాలు కూడా తీసుకోవచ్చు.

– ప్రభావతిదేవి, డీఎంహెచ్ఓ, చిత్తూరు

రిజిస్ట్రేషన్ లేకుంటే నేరం



ఇంజక్షన్లు ఇచ్చే ప్రతి వైద్యానికి కూడా కచ్చితంగా రిజిస్ట్రేషన్ ఉండాలి. రిజిస్ట్రేషన్ లేకుండా చికిత్స చేయడం నేరం. ఏపీ ఎంసీఈ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటాం. బరువు తగ్గడం కోసం పలు రకాల మందులు వాడుతున్నారు. వాటిలో కొన్ని మందులు మనిషినే హరిస్తాయి. వాడినంత వరకు బాగానే ఉంటాయి. మళ్లీ మరింత బరువును తెచ్చిపెడుతోంది. గుండె నొప్పులు కూడా మొదలవుతాయి. మంచి వైద్యుడి దగ్గర దేశీయ వైద్యం చేయించుకుంటే ఆరోగ్యపరంగా ఇబ్బందులుండవు.

– శ్రీహరి, డీఎంహెచ్ఓ, తిరుపతి

వసతులు మెరుగుపడాలి

- విద్యతోపాటు మెరుగైన వసతులు కల్పించాలి
- 45 రోజుల్లో మళ్లీ వస్తా
- మార్పు లేకుంటే చర్యలు
- ఏర్పేడు వ్యాసాశ్రమ నిర్వాహకులను హెచ్చరించిన కలెక్టర్



కుక్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ఏర్పేడు: వ్యాసాశ్రమంలోని రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో వంటగది, రక్షిత మంచినీరు తదితర సదుపాయాలు మెరుగుపడాలని కలెక్టర్ వెంకటేశ్వర్ వ్యాసాశ్రమ యాజమాన్యాన్ని హెచ్చరించారు. మంగళవారం రాత్రి ఆయన వ్యాసాశ్రమంలోని రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటశాల, భోజనశాల, మురుగునీటి కాలువలు, పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆహారం నాణ్యతగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రక్షిత మంచి నీటిని విద్యార్థులకు అందించాలని ఆశ్రమ నిర్వాహకులను కోరారు. 400 మంది విద్యార్థినులకు మంచి విద్య అందిస్తున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు కలెక్టర్‌కు తెలపగా మంచి విద్యతో పాటు వ్యాసాశ్రమంలో వంటగది పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. మరుగుదొడ్లలో రన్నింగ్ వాటర్, పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. విద్యార్థినుల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ఒక ఏఎన్ఎంను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మళ్లీ 45 రోజుల్లో తనిఖీ చేస్తానని, మార్పు రాకుంటే చర్యలు తప్పవని ఆశ్రమ నిర్వాహకులను హెచ్చరించారు. అలాగే తహసీల్దార్ రెగ్యులర్‌గా తనిఖీ చేయాలని ఆదేశించారు. శ్రీకాళహస్తి ఆర్డీఓ రవిశంకర్‌రెడ్డి, తహసీల్దారు భార్గవి, వ్యాసాశ్రమ కోశాధికారి అమరనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

యథేచ్ఛగా గ్రావెల్ తరలింపు



చిట్టమూరు మండలం, యాకసిరిలో గ్రావెల్ తవ్వుతున్న భారీ యంత్రాలు

చిట్టమూరు(చిల్లకూరు): గ్రావెల్ మాఫియా రెచ్చిపోతోంది. రాత్రీపగలు తేడాలేకుండా యథేచ్ఛగా తరలించి సొమ్ము చేసుకుంటోంది. చిట్టమూరు మండలం, యాకసిరి గ్రామంలో సోమవారం నుంచి భారీ యంత్రాలతో గ్రావెల్‌ను తరలిస్తున్నారు. రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అనుమతులకు సంబంధించిన పత్రాలు అందజేయాలని కోరితే ఫోన్ కట్ చేస్తున్నారని చెబుతున్నారు. యాకసిరి ప్రాంతంలోనే అక్రమంగా వేసిన లేఅవుట్‌ను అభివృద్ధి చేసేందుకు స్థానికంగా ఉండే అధికార పార్టీ నాయకులు కాంట్రాక్టు తీసుకున్నారని తెలిపారు. ఈ క్రమంలో దానికి సమీపంలోనే ఉన్న తెలుగుగంగ 7వ బ్రాంచ్ కాలువకు దగ్గరగా ఉన్న గ్రావెల్‌ను భారీ యంత్రాలతో తవ్వి, టిప్పర్ల ద్వారా తరలించి సొమ్ము చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ పరిశీలించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేటి నుంచి పీజీ వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ప్రారంభం

తిరుపతి సిటీ: వర్సిటీలలో పీజీ కోర్సులలో ప్రవేశం నిమిత్తం నిర్వహించిన ఏపీ పీజీ సెట్-2024 కౌన్సెలింగ్ సోమవారం రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ముగిసింది. మొదటి విడత సీట్ల కేటాయింపులో భాగంగా బుధవారం నుంచి ఈనెల 23వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల ప్రక్రియకు ఉన్నత విద్యామండలి అవకాశం ఇచ్చింది. దీంతో ఎస్వీయూ, పద్మావతి వర్సిటీలలో ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్ కోర్సులలో ప్రవేశాల కోసం విద్యార్థులు ఆప్షన్లను ఎంపిక చేసుకోవాల్సి ఉంది. 24న ఆప్షన్ల మార్పులకు వెసులుబాటు ఉంటుంది. అలాగే 28న సీట్ల కేటాయింపు పూర్తి చేసి 29వ తేదీ నుంచి సీట్లు పొందిన విద్యార్థులు ఆయా వర్సిటీలలో అడ్మిషన్లు పొందాల్సి ఉంటుంది. పలు పీజీ కోర్సులలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు అదే రోజు నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఎస్వీయూ, పద్మావతి వర్సిటీలలో అడ్మిషన్ల కోసం డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్ల విభాగంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.

30న పారా మెడికల్ కోర్సుల్లో అడ్మిషన్లు

తిరుపతి తుడా: పారా మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 30న ఎస్వీ వైద్య కళాశాల సమావేశ మందిరంలో అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్ ఒక ప్రకటనలో తెలిపారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం అర్హత గల అభ్యర్థులకు సీట్లు కేటాయిస్తామని, ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను తీసుకురావాలని తెలియజేశారు. కళాశాలలో మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ (డీఎంఎల్‌టీ) కోర్సులో 30సీట్లు, డిప్లొమో ఇన్ అనస్తీషియా(డీఏఎస్ఎస్) కోర్సులో 30సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సీట్లు సాధించిన అభ్యర్థులు ట్యూషన్ ఫీజు రూ.6వేలు, అడ్మిషన్ ఫీజు రూ.500, కాషన్ డిపాజిట్(రీఫండబుల్) రూ.1000, బోర్డు ఫీజు రూ.200 అడ్మిషన్ సమయంలో చెల్లించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

నేటి నుంచి ఐసెట్-2024 అడ్మిషన్లు

తిరుపతి సిటీ: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో అడ్మిషన్ల నిమిత్తం నిర్వహించిన ఐసెట్-2024 ద్వారా ఎస్వీయూలో సీట్లు పొందిన విద్యార్థులకు బుధవారం నుంచి సర్టిఫికెట్ల పరిశీలనతో పాటు అడ్మిషన్లు కల్పించనున్నట్లు రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ, ఎంసీఏ కోర్సులలో ప్రవేశం పొందే విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో బుధవారం నుంచి ఈనెల 24వ తేదీ లోపు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో హాజరు కావాలని తెలియజేశారు. మరిన్ని వివరాలకు ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

రాత్రుల్లో యంత్రాలు..పగలు కూలీలు!

- చంద్రగిరి నియోజకవర్గంలో ఉపాధి అక్రమాలు
- బెంబేలెత్తుతున్న కూలీలు
- పట్టించుకోని అధికారులు

తిరుపతి టాస్క్‌ఫోర్స్: చంద్రగిరి నియోజకవర్గంలో ఉపాధి అనకొండలు పెచ్చుమీరుతున్నారు. ప్రధానంగా ఎర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు మండలాల్లో రాత్రి సమయంలో యంత్రాలతో చేపలు చెరువులు తవ్వకం పనులు చేస్తున్నారు. తర్వాత పగటి పూట కూలీలతో యంత్రాలు చేసిన పనులకు మెరుగులద్దడంతో పాటు, ఫొటోలు తీసుకుంటున్నారు. ఫొటో తీసుకోవడానికి వస్తే రూ.200 కూలి ఇస్తున్నారు. పెద్ద మొత్తాల్లో అధికార పార్టీ నాయకులే దిగమింగేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఉపాధి కూలీలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారు. అవినీతికి అలవాటు పడ్డ సంబంధిత ఉన్నతాధికారులు సైతం అటువైపు కన్నెత్తి చూడకపోగా.. ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు.



కమలయ్యగారిపల్లె పంచాయతీలో రాత్రి వేళల్లో యంత్రాలతో చెరువులో తవ్వకాలు



కమలయ్యగారిపల్లె పంచాయతీలో యంత్రాలతో చేసిన పనులకు మెరుగులద్దుతున్న కూలీలు

ఇదిగో ఆధారాలు

- ఎర్రావారిపాళెం మండలం, కమలయ్యగారిపల్లె పంచాయతీ, కుమ్మరపల్లె గ్రామంలోని బయమ్మ చెరువులో ఆదివారం రాత్రి టెక్నికల్ అసిస్టెంట్ ఆధ్వర్యంలోనే జేసీబీ యంత్రాలతో పనులు చేపట్టారు.
- చిన్నగొట్టిగల్లు మండలంలో దేవరకొండ, చిట్టిచెర్ల, దీన్‌ధార్లపల్లె పంచాయతీల్లోనూ రాత్రి వేళల్లో యంత్రాలతో పనులు చేపట్టి.. పగలు కూలీలతో మెరుగులు దిద్దించారు.

అవినీతిని సహించబోను

"ఉపాధి హామీ పథకంలో అవినీతిని సహించబోను. అక్రమాలకు పాల్పడినట్లు తెలిస్తే ఊరుకునేది లేదు. విచారణ జరిపించి చర్యలు తీసుకుంటాం.

– పద్మలత, ఏపీడీ

29న సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ

తిరుపతి (అలిపిరి): టీటీడీ ఆసుపత్రులు, డిస్పెన్సరీలలో ఏడాది కాంట్రాక్టు ప్రాతిపదికన 5 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు ఈనెల 29న వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో బీసీ-బీ ఉమెన్, బీసీ-డీ ఉమెన్, ఎస్టీ ఉమెన్, బీసీ-బీ, ఎస్సీలో ఒక్కొక్క పోస్టు చొప్పున భర్తీ చేయనున్నట్లు తెలియజేశారు. టీటీడీ పరిపాలనా భవనంలోని సెంట్రల్ హాస్పిటల్‌లో 29న ఉదయం 11గంటలకు నిర్వహించనున్న ఇంటర్వ్యూకు ఎంబీబీఎస్ అర్హతగల అభ్యర్థులు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 0877-2264371 నంబర్‌గానీ లేదా www. tirumala.org వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.